

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
ఆదివారం 3 నవంబరు 2024





# 'ఖాకీ'వనంలో కలకలం!

- సీపీ హెచ్చరికలూ బేఖాతరు
- వసూళ్లు మానని కొందరు పోలీసులు
- బదిలీలతో టాస్క్‌ఫోర్సులో కానరాని మార్పు
- అవకాశం దొరికితే బాధితుల నుంచీ వసూళ్లే
- పోలీస్‌స్టేషన్లతో పాటు ఇతర విభాగాల్లోనూ వసూల్‌రాజాలు
- డ్రంకెన్‌డ్రైవ్, సివిల్ కేసులొస్తే పండగే..
- వీధి వ్యాపారులను వదలని గస్తీ పోలీసులు
- మట్టెవాడ ఘటనతో మరోసారి సిటీ పోలీసుల తీరుపై చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)
కట్టుతప్పుతున్న కొందరు ఖాకీలతో పోలీసుశాఖలో కలకలం పెరుగుతోంది. సీపీ హెచ్చరిస్తున్నా.. క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా అవినీతికి అలవాటు పడిన పోలీసులు అవకాశం దొరికిన చోట చేతివాటం ప్రదర్శిస్తున్నారు. శాంతిభద్రతలు పర్యవేక్షించే పోలీసులే కాదు.. అనుబంధ విభాగాల్లో పని చేసే వారు కూడా వసూళ్ల దందాకు దిగుతున్నారు. లైంగిక దాడులతో పాటు సివిల్ పంచాయతీల సెటిల్‌మెంట్లు, వీధివ్యాపారుల నుంచి వసూళ్లు, రాజకీయ నేతల మెప్పు కోసం స్టేషన్‌లోనే నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, బెల్లం, గుట్కా వ్యాపారుల నుంచి మామూళ్లు, స్టేషన్ కేసుల్లో అవకాశం దొరికితే అందినకాడికి వసూళ్లు చేయటం లాంటి అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తుండటం పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చుతోందనే చర్చ జరుగుతోంది. పోలీస్‌స్టేషన్లకు వచ్చే సివిల్ కేసులు, ఆర్థిక సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించే క్రమంలో కొంతమంది ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని స్టేషన్లలో ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులు అవినీతికి దూరంగా ఉంటున్నా కింది స్థాయి సిబ్బంది వసూళ్లు ఆగటం లేదనే చర్చ జరుగుతోంది. ట్రాఫిక్ విభాగంలో చాలా వరకు సీపీ ప్రక్షాళన చేసినా అక్కడక్కడ ఇంకా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే.. అందులో ప్రభుత్వం ఉద్యోగి అయితే ఇక అంతే సంగతులు. పక్కకు తీసుకెళ్లి బేరసారాలు ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్సులో ఇటీవల కొంత ప్రక్షాళన చేసిన ఇంకా ఖాకీవనంలో గంజాయి మొక్కలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. కిందిస్థాయి సిబ్బందితో పని చేయించుకునే పెద్ద సార్లపై చర్యలు లేకపోవటం ఖాకీల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో అవినీతి మరకలు ఖాకీల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

**సీపీ హెచ్చరికలు.. ఆగని సిబ్బంది వసూళ్లు..**

విధి నిర్వహణలో ఎలాంటి అవినీతికి పాల్పడవద్దని వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా హెచ్చరిస్తున్నా కొందరు పోలీసుల తీరులో మార్పు రావటం లేదనే చర్చ జరుగుతోంది. గురువారం రాత్రి మట్టెవాడ ఎస్‌ఐ విఠల్‌పై చిరు వ్యాపారి శ్రీధర్ చేసిన ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ద్విచక్రవాహనాలు నిలిపి వేస్తున్నారని బెదిరింపులకు పాల్పడుతూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడటం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. టాస్కుఫోర్సులో నలుగురు కానిస్టేబుళ్లు ఓ ముఠాగా ఏర్పడి గుట్కా, బెల్లం, రేషన్ బియ్యం అక్రమ వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న ఘటన వెలుగులోరి వచ్చింది. వీరిపై విచారణ చేపట్టిన అనంతరం ముగ్గురిపై సీపీ బదిలీ వేటు వేశారు. అలాగే నగరంలో ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ, సుబేదారి, ధర్మసాగర్, మడికొండ, నల్లబెల్లి, పర్వతగిరి, నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న 12మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్‌పై

మిగతా 8వ పేజీలో...

**ఇటీవల పోలీస్ ప్రతిష్ఠను దిగజార్చిన సంఘటనలు..**

- అక్టోబరు 18వ తేదీన జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో లాకవత్ శీను అనే యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. భార్యభర్తల గోడవలపై పోలీస్‌స్టేషన్ కేసు పెట్టినపట్టించుకోవటం లేదంటూ ఆఘాయత్యానికి పాల్పడటం కలకలం రేపింది.
- అక్టోబరు 23వ తేదీన సీఐ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. ఓ బాలికపై అత్యాచాయత్నం చేయడం, అప్పటికే పోలీసులపై ఇలాంటి కేసులు ఐదు నమోదై ఉండటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
- అక్టోబరు 23న మామునూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, మరో వివాహిత ను తీసుకుని రూ.10లక్షల నగదు, పది తులాల బంగారంతో పరారయ్యాడు. మిల్స్‌కాలనీ స్టేషన్‌లో కేసు నమోదు కావటం చర్చనీయాంశగా మారింది.
- అక్టోబరు 31వ తేదీన రాత్రి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో వీధివ్యాపారి శ్రీధర్ పోలీసులు వేధిస్తున్నారని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడటం కలకలం రేపింది.

సండే స్పెషల్
SUNDAY SPECIAL



# ఆ ఊరంతా నలభీములే

- వారు వండితే లొట్టలేసుకుంటూ లాగించాల్సిందే
- ఒకే గ్రామం నుంచి సుమారు వంద మంది వంటవారు
- దాబాలు, రెస్టారెంట్లలో వారి చేతి రుచులే..
- ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

7

ఆ ఊరుపేరు నేలపోగుల. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని ఆ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ మారుమూల పల్లెలో సుమారు 100మంది నలభీములు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. శాకాహారం నుంచి మాంసాహారం వరకు అన్నిటిలోనూ వారిది అందెవేసిన చేయి. వారు వండారంటే చాలు ఎవరైనా లొట్టలేసుకుంటూ లాగించేయాల్సిందే. 35ఏళ్ల క్రితం ఒకరికి బతుకుదెరువు కోసం వంటపనులకు రోజువారీ కూలికి వెళ్లిన వారంతా ఇప్పుడు చేయితిరిగిన వంటవారిగా పేరుతెచ్చుకున్నారు. చుట్టుపక్కన జిల్లాలు, పట్టణాలే కాకుండా హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట కనిపించే దాబాలు, రెస్టారెంట్లలో వారే వంట మాస్టర్లుగా పనిచేస్తున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాలుగా తమ వంట రుచులను ఆహారప్రియులకు అందిస్తున్నారు.

- లింగాలఘణపురం



ఓ దాబాలో వంట చేస్తున్న నేలపోగులకు చెందిన చెఫ్ శ్రీనివాస్

# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



నర్మెట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ పార్థసారథి

నర్మెట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : నర్మెట పోలీస్ స్టేషన్‌ను, సర్కిల్ కార్యాలయాన్ని ఏసీపీ పార్థసారథి శనివారం సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను, పోలీస్ వెహికిల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది కిట్లను పరిశీలించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, ఎస్సై నగేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో



ఎల్లంల పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంల పీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, టీకాలపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

# కుటుంబ సర్వేను సక్సెస్ చేయాలి

- దామాషా ప్రకారం రిజర్వేషన్లు
- చిత్తశుద్ధి ఉంటే కేంద్రం కుల గనన చేపట్టాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతోందని, నవంబరు 6 నుంచి చేపట్టే సర్వేను ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఓ ఫంంక్షన్ హాల్‌లో శనివారం సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సర్వే తర్వాత దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేశంలో బీసీ ప్రధాన మంత్రి ఉన్నా బీసీలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే దేశంలో 2025లో చేసే జనాభా లెక్కలతోపాటు కుల గణన చేపట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తోందన్నారు. గురుకుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు 40శాతం పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి పేద వారి కలలను నెరవేరుస్తుందన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కుల గణనపై మొదటగా రాహుల్‌గాంధీ ప్రస్తావించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ నవంబరు 6 నుంచి 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని, 150 కుటుంబాలకు ఒక అధికారిని నియమించడం జరిగిందని, ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తూ సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఈ సర్వే దేశానికే ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తుందని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్స్ ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు.
- వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బీజేపీ కులాల, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయం చేస్తుందని, రాహుల్‌గాంధీ దేశ ప్రజలందరూ ఆర్థికంగా సామాజికంగా

మిగతా 8వ పేజీలో...

# ఈజీఎస్ పనుల పరిశీలన

గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ

కొడకండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రామేశ్వరం, రేగుల గ్రామాల్లో ఈజీఎస్ పథకంలో జరిగిన అభివృద్ధి పనులను శనివారం నేషనల్ మానిటరింగ్ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సీసీరోడ్లు, ఫీడర్ చానల్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్, నాటిన జామాయిల్ మొక్కలను, సైడ్ డ్రైన్స్ పనులను పరిశీలించారు. వీటికి సంబంధించిన వర్క్ ఫైల్స్, నేమ్ బోర్డు, రిజిష్టర్లు, గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నేషనల్ మానీటరింగ్ సభ్యులు జెస్సీ లారెన్స్, జుబైర్ కీయూస్, అడిషినల్ డీఆర్‌డీవో జి.చంద్రశేఖర్, డిపిఎం వనిత, ఎంపీడీవో నాగశేషాద్రి, సూరి, ఏపీవో కుమారస్వామి, పాల్గొన్నారు.



రేగులలో ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న నేషనల్ మానిటరింగ్ బృందం

# క్రైం కార్నర్

## ఆటో కొనివ్వలేదని ఆత్మహత్య

- శ్రీమన్నారాయణపురంలో విషాదం



రాము(ఫైల్)

రఘునాథపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తండ్రి ఆటో కొనివ్వలేదని తనయుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీమన్నారాయణపురంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన తిప్పారపు శ్రీనివాస్ -ప్రేమలత దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు తిప్పారపు రాము(29) టెన్త్ వరకు చదువుకున్నాడు. గ్రామంలోనే కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలో శ్రీనివాస్ కుమారుడికి ఆటో కొనివ్వగా రాము ఆటో నడుపుతూ యాక్సిడెంట్ చేశాడు. అప్పటి నుంచి కూలిపనులకు వెళ్తున్నాడు. ఇటీవల ఆటో కొనివ్వాలని తండ్రిపై రాము ఒత్తి తెస్తున్నాడు. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటో కొనివ్వడానికి నిరాకరించాడు. దాంతో మనస్తాపం చెందిన రాము శనివారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాముకు భార్య, ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తల్లిదండ్రులు మందలించారని..**
వెల్దండలో యువకుడి ఆత్మహత్య

**రియల్ ఎస్టేట్ వ్యాపారికి బెదిరింపు**
ఇంటలిజెన్స్ డీజీపీ పేరిట కాల్

వివరాలు: 8లో



# ప్రకటనే ఆలస్యం!

- కాజీపేట రైల్వే డివిజన్ హోదాకు మార్గం సుగమం
- ఏడాదిలో వ్యాగన్, మరో ఏడాదిలో కోచ్ ఫ్యాక్టరీలు
- మరిన్ని అభివృద్ధి పనులతో పూర్వవైభవం
- చేరువవనున్న ఉద్యోగావకాశాలు

వివరాలు 7లో..



# ఓరుగల్లులో బీసీల ఐక్యత అద్భుతం

- బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చారు..
- వివిధ కుల సంఘాల నేతల నుంచి వినతులు అందాయి..
- రాజకీయ ప్రాతినిథ్యం లేని కులాలకు ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి..
- తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ, వినతుల స్వీకరణ
- బీసీ లేడీస్ హాస్టల్ సందర్శన.. భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బహిరంగ విచారణలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు, కలెక్టర్లు

వివరాలు 6వ పేజీలో

# ఓరుగల్లులో బీసీల ఐక్యత అద్భుతం

• బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చారు • తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ వెల్లడి • హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ, వినతుల స్వీకరణ

హనుమకొండ / హనుమకొండ కలెక్టరేట్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లులో వెనుకబడిన తరగతుల వారిలో బీసీల ఐక్యత అద్భుతంగా ఉందని, బహిరంగ విచారణకు సంఘటితంగా వచ్చిన వారి చైతన్యం చూసి ముచ్చటేసిందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ప్రశంసించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు రిజర్వేషన్ల ఖరారు కోసం బహిరంగ విచారణ నిర్వహించేం దుకు శనివారం వరంగల్‌కు వచ్చిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశమైంది. ఈ క్రమంలో చైర్మన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిల బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కులసంఘాల నాయకుల నుంచి వినతి పత్రాలను స్వీకరించింది. అనంతరం విలేకరుల సమావేశంలో చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ఇప్పటివరకు తాము ఐదు జిల్లాల్లో పర్యటించామని, అన్నిటి కన్నా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీల నుంచే సమస్యలపై పిటిషన్లు వెల్లువలా వచ్చాయని, వివిధ కులాల వారు కొత్త సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఏ జిల్లాలో రాని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 231 పిటిషన్లు అందాయని.. వీటిలో హనుమకొండ జిల్లానుంచి అత్యధికంగా 88, వరంగల్ నుంచి 55, జనగామ నుంచి 27, మహబూబాబాద్ 26, జయశంకర్ భూపాపల్లి నుంచి 28, ములుగు నుంచి 7 వచ్చాయని వివరించారు. బీసీలకు న్యాయం జరిగేలా చూడడమే బీసీ కమిషన్ లక్ష్యమని, బీసీ సంఘాల వారు నివేదించిన సమస్యలను పరిశీలించి సిఫార్సులను ప్రభుత్వానికి చేరవేస్తామని అన్నారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయ సర్వేలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, సర్వే ఆధారంగానే భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టిందని వివరించారు. సామాజిక, సర్వే కోసం ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చే సమాచారం ఆధారంగానే ప్రభుత్వ ఫలాలు అందుతాయని చెప్పారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించి 200 టోకెన్లను అందజేశామని, బీసీ కమిషన్‌కు వివిధ కుల సంఘాలు, ప్రజలు తమ అభిప్రాయాలు, విజ్ఞప్తులను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ బీసీ కమిషన్ బృందానికి వరంగల్ జిల్లాకు సంబంధించిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారని, విజ్ఞప్తులను అందించారని పేర్కొ న్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, ఎమ్మెల్యే నాయిని రాజేం దర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఆరు జిల్లాల కలెక్టర్లు బీసీ సంక్షేమ శాఖల అధికారులతో పాటు తదితర ప్రజా ప్రతిని ధులు కూడా కమిషన్ విచార ణకు హాజరయ్యారు. వివిధ బీసీ సంఘాల నేతతో సమావేశం హాలు కిక్కిరిసి పోయింది. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు కొందరు కుల సంఘాల నాయకులు అసం తృప్తి చేశారు. వాగ్వాదానికి దిగారు. కమిషన్ విచారణ ముగిసిన తర్వాత కూడా ఇంకా అనేకమంది పిటిషన్లు ఇవ్వడానికి ఎగబడగా.. కమిషన్ సభ్యులు వాటన్నిటినీ స్వీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషనర్ చైర్మన్ నిరంజన్


వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

### కమిషన్ దృష్టికి పలు ప్రధాన డిమాండ్లు...

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ బీసీ కుల సంఘాల నాయకులకు టోకెన్‌లు కేటాయించి టోకెన్ నెంబర్ ఆధారంగా ఆ సంఘం నాయకున్ని పిలిచి వారి సూచనలు తీసుకున్నారు. ఈ క్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ విజ్ఞప్తులను అందించారు. బీసీల ఏబీసీడీ గ్రూపులను పునఃవర్గీకరణ చేయాలని, కొన్ని కులాల గ్రూపును కూడా మార్చాలన్న డిమాండ్లు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను అమలు చేయాలని, అలాగే రాజకీయాల్లో ప్రాతినిధ్యం లేని కులాలకు కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు. ఇక బీసీ కులాల వారిపై జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలను నిరోధించేందుకు బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బీసీల్లోని కొన్ని కులాల వారు తమను ఎస్సీ ఎస్టీలుగా మార్చాలని కోరారు. దూదేకుల వారు తమను బీసీ డినుంచి ఈ గా, సగరవారు డి నుంచి ఏ గా, ముదిరాజ్‌లు డి నుంచి ఏ కి, వడ్డెరలు ఏ నుంచి ఎస్సీలోకి, పూసల వారు ఎంబీసీలోకి, గాండ్లవారు బీసీ ఈ నుంచి ఏకి మార్చాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు. కుల నిర్మూలన సంఘం వారు నో క్యాస్ట్, నో రిలీజియన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఏ కులం, ఏ మతానికి చెందనివారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పద్మశాలి సంఘం వారు టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసుకునేందుకు మహబూబాబాద్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 200 ఎకరాలు ఇవ్వాలని కోరారు.

### భద్రకాళి ఆలయ సందర్శన

అంతకుముందు చైర్మన్ సహా కమిషన్ సభ్యులు భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బహిరంగ విచారణ ఒక బృహత్తర కార్యక్రమమని, విచారణ ప్రారంభానికి ముందు అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఆటంకాలు తొలగిపోతాయన్నారు. అమ్మవారు శాంతరూపంలో తమకు దర్శనమిచ్చారని, ఆటంకాలు కలిగించే వారిని ఉగ్రరూపంలో అడ్డుకుంటారన్నారు.

### స్వాగతం పలికిన కలెక్టర్లు


తొలుత హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు శనివారం ఉదయం 10.40గంటలకు చేరుకున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ బృందానికి కలెక్టర్లు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారదదేవి, దివాకర, రిజ్వాన్ బాషా పూలమొక్కలను అందించారు.

### సమస్యలు చెప్పిన వెంటనే.. బీసీ హాస్టల్ సందర్శన

బీసీ సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, లేడీస్ హాస్టళ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందింది. వెంటనే స్పందించిన చైర్మన్ నిరంజన్ బహిరంగ విచారణ అనంతరం హనుమకొండ బాలసముద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్‌లోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హాస్టళ్లలోని అసౌకర్యాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కమిషన్ కులసంఘాల నుంచి వినతులను తీసుకోవడమే కాకుండా విచారణలో భాగంగా క్షేత్ర స్థాయిలో సమస్యలను కూడా స్వయంగా అధ్యయనం చేస్తోందన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

**- మహబూబాబాద్ మండలం రెడ్యాలలో ఘటన**


వెంకన్న (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ మండలం రెడ్యాలలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. రెడ్యాల గ్రామానికి చెందిన పిడుగు వెంకన్న (45)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వివిధ పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కుటుంబ అవసరాల నిమిత్తం రూ.1.50 లక్షలను అప్పు చేసినట్లు చెప్పారు. అవి ఎలా తీర్చాలనే మనస్తాపంతో గతనెల 31న రాత్రి 12 గంటల ప్రాంతంలో కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన అతని భార్య హుటాహుటిన కుటుంబసభ్యులతో కలిసి వెంకన్నను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య యాకమ్మ, ఇద్దరు కుమారులు శ్రీకాంత్, ప్రవీణ్ ఉన్నారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

## సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి విక్రమ్

జనగామ రూరల్, నవంబరు 2(ఆం ధ్రజ్యోతి): జనగామ సబ్ జైలును శనివా రం సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఖైదీలకు భోజనం, వారి ఆరోగ్య సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. జైలు సూపరిం టెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

## జీడికల్ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జనగామ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీడికల్ బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయా లని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదే శించా రు. లింగాలఘ ణపురం మండలం జీడికల్‌లో నిర్వ హించే బ్రహ్మోత్స వాల ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడు తూ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. జనగామ, యాదగిరిగుట్ట నుంచి జీడికల్ వెళ్లేందుకు భక్తులకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా, పోలీస్ కంట్రోల్ రూం, వైద్య శిబిరాలు, 108 వాహనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావే శంలో ఆర్‌డీవో గోపిరాం, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు

» అన్నారం, చెట్లముప్పారానికి లేని దైన్య స్థితి
» వరంగల్, మహబూబాబాద్‌కు పెరగాల్సిన సర్వీసులు

ఇనుగుర్తి (మహబూబాబాద్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఆవిర్భవించిన ఇనుగుర్తి మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు సరైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం, నెల్లికుదురు, వరంగల్ జిల్లా నెక్కొండ మండలాల మధ్యన ఉండే ఈ మండలానికి అన్నివైపులా రోడ్ల అనుసంధానం ఉన్నప్పటికీ సరైన బస్సు సర్వీసులు లేవు. మూడు మండలాలతో పాటు జిల్లా కేంద్రమైన మహబూబాబాద్, తొర్రూరు, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయ ంత్రం ఒకటి చొప్పున బస్సు సర్వీసులు మినహా రవాణా సౌకర్యం లేక ప్రయాణీకులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సివస్తోంది. ఉదయం 6 గంటలకు మహబూబాబాద్ నుంచి కేసముద్రం, ఇనుగుర్తి మీదుగా తొర్రూరు, హైదరాబాద్‌కు ఇదే సమయానికి నాగారం నుంచి ఇనుగుర్తి మీదుగా నెక్కొండ, వరంగల్‌కు ఒకటి చొప్పున బస్సు సర్వీసు ఉంది. నెల్లికుదురు మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఉదయం 8.30కు తొర్రూరు నుంచి నెల్లికుదురు, ఇనుగుర్తి, బొద్దాడకు, సాయంత్రం 6 గంటలకు ఇదే మార్గంలో తిరిగి వెళ్లే సర్వీసు ఒకటి నడుస్తోంది. ఇక 9.30 ఇనుగుర్తి, కేసముద్రం మీదుగా మహబూబాబాద్, ఇదే బస్సు మధ్యాహ్నం 2 గంటలకు ఇనుగుర్తికి చేరి ఇక్కడి నుంచి నాగారం వరకు వెళ్లి తిరిగి ఇనుగుర్తి మీదుగా వరంగల్‌కు వెళుతుంది. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి ఇనుగుర్తి మీదుగా కేసముద్రం, మహబూబాబాద్‌కు వెళుతుంది.

### అవసరమైన బస్సు సర్వీసులివే..

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్‌కు ఇనుగుర్తికి కేవలం 11 కిలో మీటర్ల దూరం ఉంటుంది. అన్నారం షరీఫ్‌కు ఇనుగుర్తి, మేచరాజుపల్లి మీదుగా కేసముద్రం, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి ప్రతీ శుక్రవారం వందల సంఖ్యలో భక్తులు వెళుతుంటారు. కేసముద్రం, మహబూబాబాద్ వైపు నుంచి ఇనుగుర్తి మీదుగా మేచరాజుపల్లి అన్నారం షరీఫ్‌కు ఉదయం, సాయంత్రం ఒక బస్సు సర్వీసు అవసరం ఉంది. అలాగే ఇనుగుర్తి నుంచి చెట్లముప్పారం, ఆలేరు మీదుగా మహబూబాబాద్ మార్గంలో బస్సు అసలే లేకపోవడంతో పూర్తిగా ప్రైవేటు వాహనాలపైనే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక వరంగల్‌కు ఉదయం 6, మధ్యాహ్నం 2 గంటలకు, మహబూబాబాద్‌కు 9.30, సాయంత్రం 5 గంటలకు సర్వీసులు మినహా ఇతర వేళల్లో ఆయా పట్టణాలకు బస్సు సర్వీసులు లేవు. ప్రజాప్రతినిధుల, అధికారులు స్పందించి ఇనుగుర్తి మీదుగా బస్సు సర్వీసులను పెంచాలని పలువురు కోరుతున్నారు.


ఇనుగుర్తి ఆర్టీసీ బస్సు



# రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బీసీలకు న్యాయం

**ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్**

మహబూబాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పూర్వ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బడుగు, బలహీన వర్గాలకు మరింత న్యాయం జరుగుతుందని రాష్ట్రప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. భారత్ జోడో యాత్రతో దేశ వ్యాప్తంగా ప్రజల ఆర్థిక స్థితిగతులను రాహుల్‌గాంధీ తెలుసుకున్నారని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో బీసీ కులగణనకు శ్రీకారం చుట్టారని అది కూడా తెలంగాణ నుంచే ఆరంభమవుతుందని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కులగణనపై కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కులగణన విజయవంతానికి కాంగ్రెస్ కార్యకర్తలు తన వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. హైదరాబాద్ భవిష్యత్ కోసమే హైడ్రా అని, తాగునీటి ఇబ్బందులు తలెత్తవద్దని భూగర్భజలాల పెంపుదల కోసమే చెరువుల పరిరక్షణ అని చెప్పారు.

### కులగణనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

**- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్**

గ్రామాలు, పట్టణాల్లో ఈనెల 6 నుంచి జరిగే కులగణనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కులగణనపై అపోహలు వద్దని ఖచ్చితంగా జరిగి తీరుతుందన్నారు. 2014 లో మాజీ సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) నిర్వహించినప్పటికి బీసీ లెక్కలు బయట పెట్టేందుకు భయపడ్డారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేసిన తర్వాతనే జనాభా ప్రాతిపదికను రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన దమ్మున్న నాయకుడని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తొర్రూరు మార్కెట్ వైస్ చైర్మన్ భట్టు నాయక్, వివిధ పార్టీలు, కుల సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు దస్రూ నాయక్, నీరుటి లక్ష్మీనారాయణ, అల్లం నాగేశ్వర్ రావు, బండారు వెంకన్న, ఎడ్ల రమేష్, ఖలీల్‌పాషా, ఎక్బాల్, అబ్దుల్ లతీఫ్, వేముల వెంకన్న, పెరుగుకుమార్, సమ్మెట రాజమౌళి, పోతురాజు రాజు, భూక్య శ్రీను, స్వర్ణలత, విజయలక్ష్మి, గోగుల మల్లయ్య, చిట్టి వెంకటేశ్వర్లు, అశోక్‌గౌడ్, నీరుటి సురేష్ నాయుడు, గుగులోతు రవినాయక్, గునిగంటి కమాలకర్, తాళ్లపల్లి జగన్, సిరిపురం వీరన్న తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో కులగణనపై అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు రాంచందర్‌నాయక్

# పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు

• రూ. 2 కోట్లతో కేసముద్రం జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి • మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ • అట్టహాసంగా రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్


కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో కొనసాగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు

కేసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే ఏరంగంలోనైనా రాణిస్తారని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ పేర్కొన్నారు. కేసముద్రం హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) తెలంగాణ మహబూబాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, పూమా పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కోసం రూ.2కోట్ల నిధులను మం జూరు చేయించేందుకు కృషి చేస్తానని, ఎమ్మెల్యేతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీ నిధుల్లోంచి ఇక్కడ షటిల్ కోర్టును కూడా వేయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసిక స్థైర్యం అలవడుతుందని, తాను ఫుట్‌బాల్ క్రీడాకారున్ని కావడంతోనే ఎన్నికల ప్రచారంలో ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటింటికీ ప్రచారం నిర్వహించగలిగానన్నారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఓడిన వారే పాఠాలు నేర్చుకుంటారన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బాల్యం నుంచే ఏదో ఒక రంగంలో నైపుణ్యం సాధించిన వారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పట్టుదలతో అందివచ్చిన అవకాశాలన్నిటిని వినియోగించుకొని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, డీవైఎస్‌వో జ్యోతి, హెచ్ఎంలు బందెల రాజు, బండారు నరేందర్, రూరల్ సీఐ సర్వయ్య క్రీడా నిర్వాహకులు రావుల మురళి, కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు. ఇక ఈ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా నర్సంపేట కళానిధిక్షేత్రానికి చెందిన కూచిపూడి విద్యార్థినులు, కల్వల హైస్కూల్ విద్యార్థినిల నృత్యాలు, మరిపెడ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థుల బ్యాండ్ మ్యూజిక్, వివిధ జిల్లా జట్లు నిర్వహి ంచిన మార్చ్ ఫాస్ట్ అలరించాయి. ఈ క్రీడలకు పది ఉమ్మడి జిల్లాల నుంచి బాస్కెల్‌బాల్, పూమా 17, 19 ఏళ్ల విభాగాల్లో 20 చొప్పున 60 జట్లకు చెందిన 720 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

# కార్తీకం.. ఆరంభం

**• వేయిస్తంభాల ఆలయంలో భక్తుల పూజలు .. రుద్రేశ్వరుడికి లక్ష పుష్పార్చన •**


రుద్రేశ్వరుడికి ప్రత్యేక పుజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు

హనుమకొండ చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శివవిష్ణువులకు ప్రీతికరమైన కార్తీక మాసం ఆరంభమైంది. తొలిరోజైన శనివారం ఉమ్మడి జిల్లాలోని పలు శైవక్షేత్రాలు, ఆలయాలు ఆధ్మాత్మిక సందడిని సంతరించుకున్నాయి. ముఖ్యంగా హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శివవిష్ణువులకు ప్రీతికరమైన ఈ మాసంలో రుద్రేశ్వరుడికి పూజలు నిర్వహించడం ద్వారా విశేష ఫలం లభిస్తుందన్నారు. మహిళలు సామూహికంగా దీపోత్సవాలు, పూజలు, ధాత్రినారాయణ కల్యాణ ఉత్సవాలు ఉసిరిక పూజలు, దీపాలు, అన్నదానాలు, వస్త్రదానాలు చేయడం అనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవతో ఉత్తిష్ట గణపతికి హరిద్రామం కుంకుమ అలంకరణ నిర్వహించిన అనంతరం శ్రీరుద్రేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చక బృందం నిర్వహించిందన్నారు. అదే విధంగా స్వామి వారికి ఐదురకాల పుష్పాలు లిల్లీ, బంతి, చామంతి, గులాబీ, మల్లె పుష్పాలను విజయవాడ నుంచి తెప్పించి కన్నుల పండగా పుష్పార్చనను నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు సామూహికంగా అభిషేకాలు, నిర్వహించారు. కాగా, ఆలయంలో సరైన వసతులు లేవని భక్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవో తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. రాష్ట్ర దేవాదాయ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తగిన వసతులు కల్పించాలని ఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా వుండగా, కార్తీక మాసం తొలిరోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సందీప్‌శర్మ, మణికంఠశర్మ, సేవకులు ప్రసాద్, కాశీవిశ్వనాథచారి, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, సుజాత పాల్గొన్నారు.


కాళేశ్వరాలయ ప్రాంగణంలో వత్తులు కాలుస్తున్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద దీపాలంకరణ వెలిగిస్తున్న అర్చకులు

## కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, నవంబరు 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర క్షేత్రం కార్తీక సందడిని సంతరించుకుంది. కార్తీక మాసం తొలి రోజైన శనివారం ఆలయానికి తరలొచ్చిన భక్తులు తొలుత గోదావరిలో స్నానం ఆచరించి స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రమిదలు, తైలం అందజేశారు. ఉసిరి చెట్టు వద్ద భక్తులు వత్తులు కాల్చారు. ఉసిరి చెట్టు, తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఘనంగా ఆకాశదీపం

కార్తీక మాసం సందర్భంగా నెలరోజుల పాటు ధ్వజస్తంభానికి ఆకాశ దీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. శనివారం నుంచి రోజూ 108 దీపాల అలంకరణ కార్యక్రమం కాళేశ్వరంలో నిర్వహించనున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, గ్రామస్థులు, అర్చకులు పాల్గొన్నారు.

**అభిరుచి**




# ఆ ఊరంతా నలభీములే

లింగాలఘణపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుచికరమైన వంటకాల్లో వాళ్లది అందెవేసిన చేయి.. నోరూరించే పసందైన భోజనాల తయారీలో వాళ్లకు మరెవరూ సాటి రారు.. చికెన్ బిర్యానీ.. మటన్ బిర్యానీ.. చికెన్ టిక్కా.. తందూరి చికెన్.. జింజర్ చికెన్.. బటర్‌చికెన్.. చికెన్ కోలాపూరి.. చికెన్‌మసాల ఇలా ఏది వండి నా లొట్టలేసుకునే తినాల్సిందే. హైద్రాబాద్ నుంచి వరంగల్ దాకా, సిద్దిపేట నుంచి సూర్యాపేట దాకా రహదారుల వెంట దాబా ఉందంటే అక్కడ ఖచ్చి తంగా నేలపోగులకు చెందిన వంట మాస్టర్ ఉండా ల్సిందే. లింగాలఘణపురం మండలంలోని మారు మూల పల్లె నేలపోగుల గ్రామం ప్రత్యేకత. నిరుపేద లకు, నిరుద్యోగులకు నిలయం. బతుకుదెరువు కోసం వంటల తయారీ వైపు దృష్టిని సారించారు. వంద మం ది దాకా నలభీములుగా(వంటల మాస్టార్లు) మారా రు. ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల గ్రామ వంటకాలపై ఆంధ్రజ్యోతి సండే స్పెషల్.

- రుచికరమైన వంటల్లో వారికి లేరుసాటి..
- దాబా, రెస్టారెంట్లలో ఆ గ్రామ మాస్టర్ల రుచులే..
- ప్రత్యేకతను చాటుతున్న నేలపోగుల వంట మాస్టర్లు

**మూడున్నర దశాబ్దాల పయనం..**

జనగామ జిల్లా నిరుపేదలకు నిలయంగా ఉండేది. పెరుగుతున్న కుటుంబ భారం.. పిల్లల చదువులు.. వృద్ధ తల్లిదండ్రుల పోషణ ఇలా అనేక రకాల బాధ్యత లు నేలపోగుల గ్రామస్థులను కుదుపేస్తున్న క్రమంలో దినసరి కూలీగా వంటకాలు చేయడం వైపు దృష్టి సారించారు. 35ఏళ్ల క్రితం ఒకరికి మరొకరు సాయం గా ఒకరి తర్వాత ఇంకొకరు వంటకాలను తయారు చేస్తూ యువకులు నలభీములుగా ఆరితేరారు. మొద ట్లో హైద్రాబాద్, వరంగల్‌లాంటి పట్టణాల్లో పెద్దపెద్ద హోటళ్లలో వంటల మాస్టార్లుగా పనిచేశారు. ఆతర్వాత స్వయంగా ఉపాధి మార్గాలను అన్వేషించుకుంటూ సొంతంగా దాబాలను ఏర్పాటు చేసుకుని ఆర్థిక స్థిర త్వాన్ని సాధించే దిశగా పయనిస్తున్నారు. ఇప్పుడు హైద్రాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా కేంద్రంలో రకరకాల రుచికరమైన వంటకాలతో భోజనప్రియులను ఆకట్టుకునే దాబాలన్నీ నేలపోగుల గ్రామానికి చెందిన మూలాలే అత్యధికం.




**నోరూరించాల్సిందే..**

గాజులు లేని వంట గమ్మత్తయిన వంట అన్నట్లుగా నేలపోగుల చెందిన అనేక మంది వంటల మాస్టార్లు వంటకాలు తయారుచేయడంలో మహిళలను తలద న్నేస్తున్నారు. ఇంట్లో తయారుచేసుకున్నట్లుగానే తెలం గాణ చికెన్, ఆంధ్రా చికెన్ ఇలా ప్రాంతాల వారిగా వినియోగదారులకు ఇష్టమైన రీతి లో తయారు చేసే వంటలు చేస్తే అక్కడు న్న వ్యక్తులు ఎప్పుడెప్పుడా అంటూ లొట్ట లు వేయాల్సిందే. ఒక్కసారి నేలపోగులకు చెందిన చేతివంటకాలు రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపించడమే వీరి ప్రత్యేకత.


దాబాలో చపాతీ కాలుస్తున్న చెఫ్

**విందు కార్యక్రమాల్లో వంటలు..**

రుచికరమైన వంటలు తయారు చేయడంలో ప్రావీణ్యతను సాధించిన నేలపోగుల వంటల మాస్టార్లు కేవలం దాబాల్లోనే కాకుండా విందు కార్యక్రమాలకు ఆర్డర్‌పై వంటలను తయారు చేసేందుకు మొబైల్ సర్వీస్ కూడా చేస్తున్నారు. పెద్ద పెద్ద ఫంక్షన్లలో వంట లు చేసేందుకు కొందరు తమ పరివారంతో బయలు దేరి ఉపాధి పొందడంలోనూ నేలపోగుల నలభీములు భోజనప్రియులతో వారెవ్వా అనిపించుకుంటున్నారు.

**33 ఏళ్ల నుంచి వంటలు చేస్తున్నా..**

**- తేరాల శ్రీనివాస్, నేలపోగుల**



మాది పేదరిక కుటుంబం. నేను పెద్దగా చదువుకోలేదు. 33ఏళ్ల క్రితం హన్మకొండలోని ఓ హోటల్‌లో పనిచేసేందుకు ఊరి నుంచి బయలుదేరాను. అక్కడే వంట మాస్టార్‌గా నైపుణ్యతను సాధించాను. ఆ తర్వాత స్వయంగా దాబా పెట్టాలనే ఆలోచన వచ్చింది. ప్రస్తుతం జనగామ జిల్లా కేంద్రంలో దాబాను నడిపిస్తున్నాను. 33 ఏళ్ల నుంచి ఇదే వృత్తిలో ఉంటూ ప్రస్తుతం ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకున్నాను. నేలపోగుల నుంచి ఎంతో మంది వంటకాన్నే ఉపాధిగా మార్చుకోవడం ఆనందంగా ఉంది.

# ఇక నుంచి పుష్‌పుల్ మరో ట్రిప్పు

**» పునః ప్రారంభమైన మధ్యాహ్నం రైలు » ప్రతీ రోజు 1.45 గంటల కు వరంగల్ నుంచి పయనం**




గిర్మాజీపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పేదల రైలుగా పేరు గడించిన వరంగల్-హైదరాబాద్ పుష్‌పుల్ రైలు రెండేళ్ల తరువాత మధ్యాహ్నం ట్రిప్పు తిరిగి అందు బాటులోకి వచ్చింది. కరోనాకు ముందు వరంగల్ నుంచి ఉదయం, మధ్యాహ్నం హైదరాబాద్‌కు నడిచేది. కరోనా లాక్‌డౌన్‌తో 2021 నుంచి పుష్‌పుల్ రైలు నిలిచిపోయింది. కరోనా తరువాత అన్ని రైళ్లు యథా విధిగా మొదలైనప్పటికీ పుష్‌పుల్ రైలు నడవలేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' పలు వార్తా కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు కేవలం మధ్యాహ్నం మాత్రమే 2022 జూలై 25న ప్రారం భించి కొద్ది కాలం నడిపి నిలిపివేశారు. అయితే కాజీపేట నుంచి మాత్రం ప్రతీ రోజు ఉదయం వేళ మాత్రం హైదరాబాద్‌కు నడుస్తోంది.

**24 నెలల తరువాత..**

వరంగల్ నుంచి మధ్యాహ్నం నడిచిన పుష్‌పుల్ రైలును 2022 అక్టోబర్‌లో రైల్వే అధికారులు నిలిపివే శారు. అప్పటి నుంచి వరంగల్ ప్రజలు అనేక వ్యయప్రయాసలకు ఓర్చి కాకతీయ, గోల్కొండ, శాతావాహన, గోదావరి తదితర ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లలో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ విషయంపై గత ఆగస్టు 31న 'ఆంధ్రజ్యోతి' మరో కథనం ప్రచురించింది. దీంతో రైల్వే ఉన్నత అధికారులు స్పందించి ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలును తిరిగి ప్రారంభించారు. ఈ రైలు ప్రతీ రోజు మధ్యాహ్నం వరంగల్ నుంచి 1.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు కాజీపేటకు చేరుకుని అక్కడి నుంచి 2.15 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. అయితే ప్రజలకు ఈ సమాచారం లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం ప్రయాణికులు తక్కువగానే వచ్చారు. పుష్‌పుల్ టికెట్ వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు రూ.35 ఉండగా హైదరాబాద్‌కు రూ.40 ఉంది. కాగా, ప్రస్తుతం ఉదయం కాజీపేట నుంచి హైదరాబాద్ నడుస్తున్న పుష్‌పుల్ రైలును గతంలో మాదిరిగా వరంగల్ నుంచి నడిపించాలని, ఈ దిశగా రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వరంగల్ ప్రజలు కోరుతున్నారు.

# ప్రకటనే ఆలస్యం!

- కాజీపేట రైల్వే డివిజన్ హోదాకు మార్గం సుగమం
- ఏడాదిలో వ్యాగన్, మరో ఏడాదిలో కోచ్ ఫ్యాక్టరీలు
- మరిన్ని అభివృద్ధి పనులతో పూర్వ వైభవం



కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్.. డివిజన్‌గా మారబోతోంది. అందుకు మార్గం సుగమమైందన్న సంకేతాలు వస్తున్నాయి. కాజీపేటకు వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు, బైపాస్ లైన్ నిర్మాణం, అమృత్‌భారత్‌లో భాగంగా కాజీపేట రైల్వే స్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ స్థాయిలో ఆధునికీకరిం చనున్నారు. అందుకు కావాల్సిన రోడ్డు రవాణా, నీటి సౌకర్యం, కావాల్సిన స్థలం సిద్ధంగా ఉంది. దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యధిక ఆదాయం కాజీపేట జంక్షన్ నుంచే వస్తోంది. దీంతో డివిజన్ హోదా కల్పించక తప్పని పరిస్థితి. ఇన్ని అనుకూల అవకాశాలున్న కాజీపేట డివిజన్ హోదా ప్రకటించడమే ఆలస్యమనే చర్చ జరుగుతోంది. కాజీపేట రైల్వే డివిజన్ హోదా వస్తే రైల్వే పరంగా కాజీపేటలో డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) కార్యాలయాలతో పాటు ఇతర అన్ని ముఖ్యమైన కార్యాలయాలు ఇక్కడే నిర్మించాల్సిన పరిస్థితి. ఇక కాజీపేటకు మహర్దశేనన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

**వచ్చే ఏడాది అందుబాటులోకి వ్యాగన్లు..**

2013లో కాజీపేట మండలం మడికొండ సమీపంలోని అయోధ్యపురంలో 160 ఎకరాల్లో రూ.523 కోట్ల నిధులతో నాటి కేంద్ర రైల్వే శాఖ మంత్రి మమత బెనర్జీ రైల్వే పీవోహెచ్ మంజూరు చేశారు. తర్వాత వ్యాగన్ తయారీ పరిశ్రమగా అప్‌గ్రేడ్ చేశారు. కాలక్రమేణా ఆలస్యమైనా 2023లో ప్రధాని మోదీ రూ.66కోట్లు అదనపు నిధులతో సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో వ్యాగన్ తయారీ పరిశ్రమను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ వ్యాగన్ తయారీ పరిశ్రమ 2025 ఆగస్టులో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులు చకచక సాగుతున్నాయి.

**కోచ్‌ఫ్యాక్టరీ కూడా..**

కాజీపేట వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కాజీపేటకు మంజూరైంది. వ్యాగన్ తయారీ పరిశ్రమను అప్‌గ్రేడ్ చేస్తూ రూ.680కోట్లతో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అందుకుగాను రూ.66 కోట్ల నిధులు కూడా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ స్థలం, నిధు లపై సర్వేచేసి రైల్వే బోర్డుకు సమర్పించారు. 1980 దశకం నుంచి డిమాండ్ ఉన్న కోచ్‌ఫ్యాక్టరీ సాధనకోసం తెలంగాణ రైల్వే జేఏసీ, మజ్దూర్ , ఎంప్లాయిస్ సంఘ్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నో ఉద్యమాలు చేశాయి. ఎట్టకేలకు కేంద్రం కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేసింది. కోచ్‌ఫ్యాక్టరీ 2026 చివరి నెలలో అందుబాటులోకి రావడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి మధ్య బైపాస్ లైన్ నిర్మాణం, ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్, హసన్‌పర్తి, వరంగల్ మధ్య మూడో లైన్ నిర్మాణంతో రైల్వే పరంగా కాజీపేట అభివృద్ధిని ఊహించలేమంటున్నారు విశ్లేషకులు. ఇన్ని అభివృద్ధి పనులు జరుతున్న దృష్ట్యా నిరుద్యోగులకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్య క్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమంది ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచ నా వెరసి రైల్వే కార్మికులో కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

**కాజీపేటకు పూర్వవైభవం**

ఒకప్పుడు కాజీపేట నగరం రైల్వే కార్మికులతో కళకళలాడేది. కాజీపేట అంటేనే రైల్వే కార్మికుల కేంద్రం. అలాంటిది రోజురోజుకు రైల్వే కార్యాలయాల తరలింపు, ఉద్యోగుల బదిలీలతో కళతప్పింది. కాజీపేటలో రైల్వే పరిశ్రమలు నిర్మించాలని, దీంతో కార్మికులతో కాజీపేటకు పూర్వ వైభవం రావాలని ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేశాయి. దీంతో కాజీపేటలో వ్యాగన్ పీవోహెచ్, వ్యాగన్ తయారీ, వందేభారత్ కోచ్‌లతోపాటు లింక్‌హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ), ఎలక్ట్రిక్ మల్టిబుల్ యూనిట్ (ఈఎంయూ) కోచ్‌లు తయారు చేసే కోచ్ ఫ్యాక్టరీ కాజీపేటలోనే తయారు కానున్నాయి. వెరసి కాజీపేట జంక్షన్ గతంకన్నా భిన్నంగా వేలాదిగా రైల్వే కార్మికులు, వారి కుటుంబాలు, విద్యాలయాలతో కాజీపేట జంక్షన్ కళకళలాడనుంది.

# ఘనంగా 'జోడెద్దుల' ఉత్సవం

**• ఉత్సాహంగా రెండో రోజు దీపావళి బతుకమ్మ వేడుకలు • కోలాటాల మధ్య కుంటకు తరలిన నేతకాని కులస్థులు • నేడు ముగియనున్న ఉత్సవాలు**


జోడెద్దులకు ఆరగింపు చేస్తున్న నేతకాని కులస్తులు

హసన్‌పర్తి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు హసన్‌పర్తి మండలంలోని సీతంపేట నేతకాని కులస్థులు నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలు శుక్రవారం సంప్రదాయం బద్ధంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. నేతకాని కులస్థులు కేదారీశ్వరస్వామి వ్రతం నిర్వహించుకొని జోడెద్దులకు పిండి వంటలతో తయారు చేసిన నగల (నాగళి, కోల, దుత్తలు, గొడుగు)తో ప్రత్యేకంగా అలంకరించారు. రెండో రోజు శనివారం పురుషుల ఘట్టంలో భాగంగా జోడెద్దుల ప్రతిమలను తీసుకొని కోలాటాలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకున్నారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను తీసి ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) సరసాలాడి రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, బొంబాయి లాంటి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేతకాని కులస్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పురుషుల కోలాటాల నృత్యాలు, కోలాటం పాటలు గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బండారి రజితచేరాలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజీవ్‌గాంధీ, నేతకాని కుల పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు. అయితే మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు మూడో రోజైన ఆదివారం ముగియనున్నాయి. చివరిరోజున నేతకాని మహిళలు మాత్రమే జరుపుకొంటారు. తీరొక్క పూలతొ పేర్చిన బతుకమ్మను కేదారీశ్వర స్వామి ఎదుట ప్రత్యేకంగా పూజిస్తారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురాలు జరుపుకొంటారు. అనంతరం బతుకమ్మపై ఏర్పాటు చేసిన గౌరమ్మను వాయినంగా ఇచ్చి పుచ్చుకొని వారి వెంట తెచ్చుకున్న సద్దిని పంచుకొని ఒకరికొకరు తినిపించు కుంటారు. అనంతరం బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేయడంతో మూడు రోజుల పాటు నిర్వహించే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి.


ఊరేగింపుగా తరలివస్తున్న నేతకాని కులస్తులు

# రక్షణకు పచ్చని పరదా..

» విరివిగా వినియోగిస్తున్న ప్రజలు
» పల్లెల్లో ఏ ఇంట చూసినా ఇవే..


గ్రీన్‌మ్యాట్‌తో ఇళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పర్వతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. సామగ్రి మొదలు కూలీల వరకు అంతా భారమైంది. ఏ పనిచేయాలన్నా లక్షల్లో ఖర్చవుతోంది. ఈ క్రమంలో పచ్చని పరదాలు సామాన్యుల పాలిట రక్షణ కవచాలుగా మారాయి. చాలామంది తమ ఇళ్లకు ప్రహరీలుగా.. ఎండకు నీడనిచ్చే పైకప్పుగా.. చిన్నపాటి గదులను ఏర్పాటు చేసే గోడల్లా మారుతున్నాయి. అంతేకాదు చిన్నచిన్న షాపులు, హోటళ్లు ఏర్పాటు చేసుకునే చిరువ్యాపారులు కూడా వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. వేలల్లో అయ్యే ఖర్చును కాస్త రూ.వందల్లోనే పూర్తిచేసుకుంటున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా సాధారణ ప్రజలు వీటిని వినియోగిస్తున్నారు. అయితే ఈ పరదాలు పలు సైజులు, నాణ్యతను బట్టి కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ఉంటుండటం, ఆ ధరలు అందుబాటులో ఉండటం, మన్నిక కూడా ఉండటంతో ప్రజలు వీటివైపు ఆసక్తి చూపుతున్నారు.


గ్రీన్‌మ్యాట్‌తో ఏర్పాటుచేసిన ప్రహరీ

క్రైం కార్నర్

## తల్లిదండ్రులు మందలించారని..

### వెల్దండలో యువకుడి ఆత్మహత్య

నర్మెట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇంటివద్ద ఖాళీగా ఉండకుండా ఏదోఒక పనిచేసుకోవాలని తల్లిదండ్రులు సూచించడం.. మనస్తాపం చెందిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినఘటన వెల్దండలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై నగేష్ కథనం ప్రకారం. వెల్దండకు చెందిన ఎడమల్ల ప్రవీణ్‌రెడ్డి(27) పౌల్ట్రీ ఫాంలకు దాన సప్లై సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. కాగా, నెల రోజుల నుంచి గ్రామంలోనే ఇంటివద్ద ఖాళీగా ఉంటూ ఒంటరిగా ఆలోచిస్తూ ఉంటున్నాడు. ఇలా ఖాళీగా ఉండకుండా ఏదో ఒకపని చేసుకోవాలని సూచించారు. దాంతో మనస్తాపం చెందిన ప్రవీణ్‌రెడ్డి గ్రామ శివారులోని గంటమ్మ చెరువు కట్ట వద్ద పరుగుల మందు తాగిన తన అక్క స్రవంతికి ఫోన్ చేసి విషయం చెప్పాడు వెంటనే అక్కడికి చేరుకుని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉప్పల్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారికి బెదిరింపు

జనగామ, నవంబరు2(ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణానికి చెందిన తొట్టెకృష్ణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి శనివారం ఇంటలిజెన్స్ డీజీపీ పేరిట ఓ బెదిరింపు కాల్ వచ్చింది. బాధితుడు కృష్ణ కథనం ప్రకారం.. ఇంటలిజెన్స్ డీజీపీ పేరిట వాట్సాప్ నుంచి ఫేక్ ఆడియో కాల్ వచ్చింది. అవతల వ్యక్తి మాట్లాడుతూ మీ కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడా.. అతను ఎక్కడ ఉన్నాడంటూ హిందీ భాషలో ఆరా తీసే ప్రయత్నం చేశాడు. దీంతో అప్రమత్తమైన కృష్ణ అవతలి వ్యక్తి ఫేక్ కాల్ చేశాడని గమనించి తన కొడుకు గురించి నీకెందుకు వివరాలు అవసరమంటూ ఎదురు కౌంటర్ ఇచ్చాడు. అంతటితో అవతలి వ్యక్తి వినకుండా హిందీలో దుర్భాషలాడుతూ డబ్బులను గుంజే ప్రయత్నం చేయడంతో కృష్ణ రివర్స్ కౌంటర్ దీటుగా ఇవ్వడంతో ఫోన్ కట్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. అయితే వాట్సాప్ ఆడియో కాల్ చేసిన అవతలి వ్యక్తి డీపీ ఫొటో పోలీస్ డ్రెస్ వేసుకున్న వ్యక్తిగా ఉండటం గమనార్హం.

## చేనులో కొండ చిలువ

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చంద్రుతండాలో మాలోతు శ్రీనివాస్ పొలంలో భారీ కొండచిలువ కనిపించింది. శనివారం రైతు శ్రీనివాస్ వరి కోత చేస్తున్న క్రమంలో 10అడుగుల పొడవు ఉన్న కొండచిలువ కనబడడంతో భయాందోళనకు గురయ్యాడు. ఇతర రైతుల సహకారంతో కొండ చిలువను హతమార్చి బయట పడేశారు.

# అభివృద్ధిలో డబుల్ ధమాకా మార్క్

### నీతి నిజాయితీకే ప్రాధాన్యతనిస్తాం: ఎంపీ కావ్య



నెల్లుట్లలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

లింగాలఘణపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తనకు రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యేగా నాన్న(ఎమ్మెల్యే శ్రీహరి) నిధులు, ఎంపీగా తన నిధులను జోడించి డబుల్ ధమాకా అభివృద్ధిని చూపిస్తామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం లింగాలఘణపురం, కళ్లెం, నెల్లుట్ల, కుందారం గ్రామాల్లో ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, అర్హులకు అవసరమైన న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగ అవకాశాల కల్పనలో పైరవీలకు తావుండబోదన్నారు. పదవుల పంపకాల్లోగానీ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లోగానీ అర్హులకే న్యాయం జరుగుతుంద న్నారు. తెలంగాణ ప్రభుత్వ రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రైతుల రుణాలను మాఫీ చేస్తున్నారన్నారు. తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి సూచన మేరకు లింగాలఘణపురం మండలానికి ఆరు హైమాస్ట్ లైన్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

### హామీలను నెరవేరుస్తున్నాం..: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ తాను ఎన్నికల ముందు మండల ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా యాసంగి పంటకు గోదావరి జలాలతో చెరువులను నింపి పంటలకు నీరందిస్తానన్నారు. కళ్లెం-జీడికల్ రోడ్డు, లింగాలఘణపురం-జీడికల్ రోడ్డు, చీటూరు వాగుపై కోడూరుకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకులకు రాష్ట్రంపై ప్రేమ ఉంటే కేంద్రం నుంచి రూ.50వేల కోట్ల నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యచరణ చేపట్టిందని, నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయిస్తున్నారన్నారు. అదనంగా సీఎంను ఒప్పించి మరో 1500 ఇళ్లను తీసుకువచ్చి అర్హులందరికీ ఇళ్ల నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో తాజామాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, ప్యాక్స్ చైర్మన్లు బుషిగంపల ఉపేందర్, మల్ల శ్రీశైలం, మార్కెట్ డైరెక్టర్లు నీలం మోహన్, శ్రీలతారెడ్డి, మాజీ డైరెక్టర్ బుషిగంపల అంజనేయులు, చిట్ల భూపాల్‌రెడ్డి, గుర్రం బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**వీరభద్రస్వామి ఆలయ సందర్శన**

మండల కేంద్రం లోని వీరన్నగుట్టపై ఉన్న వీరభద్ర స్వామి ఆలయాన్ని ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి సందర్శించారు. గుట్టపైనున్న ఆలయానికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు కోరగా, సానకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బంధ్రు సత్తయ్య, ఏదునూరి వీరయ్య, కేమిడి భిక్షపతి, సాదం విజయ మనోహర్, కేమిడి అనిల్ పాల్గొన్నారు.



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న మందకుమార్

## వర్గీకరణ తర్వాతే ఖాళీలు భర్తీ చేయాలి

### ఎంఎస్‌పీ నాయకుడు మందకుమార్ మాదిగ

బచ్చన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును తెలంగాణలో ప్రథమంగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి, వర్గీకరణ జరగకుండానే డీఎస్సీ వేసి ఉద్యోగాలు భర్తీ చేయటం మాదిగలకు అన్యాయం చేయటమేనని ఎంఎస్పీ నేత మందకుమార్ మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం జనగామ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే డిసెంబరు 21న మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, బొర్ర భిక్షపతి, కొయ్యడ మల్లేశ్, గద్దల కిశోర్, సందెన రవీందర్, అల్వాల నర్సింగరావు, రాజు, ఉదయ్, పాకాల కుమారస్వామి, నల్ల అంజయ్య పాల్గొన్నారు.

● జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకువచ్చిన తరువాతనే ఉద్యోగాల భర్తీ చేయాలని మందకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే డిసెంబరు 21న హైద్రాబాద్‌లో మాదిగల ధర్మయుద్ధ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నీర్మాల రత్నం, బొడ్డు దయాకర్, బొర్ర బిక్షపతి, సూరన్న, రాగళ్ల ఉపేందర్, కొయ్యడ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బోధనేతర పనులను అప్పగించొద్దు

పాలకుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు ఉపయోగించవద్దని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాట్లా డుతూ కులగణన పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధనేతర పనులకు అప్పగించడం ఇబ్బంది కరంగా ఉంటుందన్నారు.

## బాధిత కుటుంబానికి బీజేపీ నేతలపరామర్శ

చిలుపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నపెండ్యాలలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన పొత్క నూరి సుగుణ (75) కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు సందర్శించారు. సుగుణ మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం మృతురాలి కుమారుల్ని పరామర్శించారు.

## రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌లో విద్యార్థి ప్రతిభ



అలేఖ్యకు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

లింగాలఘణపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన హైద్రాబాద్ మాదాపూర్‌లోని సెంటర్ ఫర్‌కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రేనింగ్ సెంటర్‌లో శనివారం కళా ఉత్సవ్ పోటీసులు నిర్వహించారు. ఇందులో చీటూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అలేఖ్య తన ప్రతిభను చాటింది. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న అలేఖ్య ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో తన ప్రతిభను చాటి కన్సోలేషన్ బహుమతిని అందుకున్నట్లు హెడ్మాస్టర్ ఐత నర్సింహులు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని అలేఖ్యతోపాటుగా గైడ్ టీచర్ కల్ప నను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినందించారు.

న్యూస్ బాక్స్



చైర్మన్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

## పద్మశాలీలకు రిజర్వేషన్లు కల్పించాలి

రఘునాథపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు రిజర్వేషన్లు కేటాయించాలని కంచనపల్లికి చెందిన పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు రాపోలు రామ్మూర్తి ఆధ్వర్యంలో పద్మశాలీ సంఘం నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. రామ్మూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన కార్యక్రమాన్ని చేపట్టడంతో బీసీలకు అన్ని రంగాలలో సముచిత స్థానం లభించడం సాధ్యమవుతుందని అన్నారు. పద్మశాలీలకు రాజకీయ తదితర రంగాలలో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..

జనగామ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశంపై శనివారం హన్మకొండలో జరిగిన బీసీల బహిరంగ విచారణకు జిల్లా నుంచి విశ్వకర్మలు తరలివెళారు. హన్మకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి హాజరైన విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు బీసీ కమిషన్ చైర్మన్ బినిరంజన్, సభ్యురాలు బాలలక్ష్మికి తమ సమస్యలపై వినతిపత్రంఅందజేశారు. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి రూ2వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మాతృసంఘం జిల్లా అధ్యక్షులు నారోజు రామేశ్వరాచారి, ఇత్తడి పారిశ్రామిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలూరి మల్లికార్జునాచారి, దీగోజు సాంబయ్య, ఆకోజు అంజనేయులు, పొన్నోజు రతన్‌కుమార్, వైకుంఠచారి ఉన్నారు.

## విద్యార్థికి సన్మానం



జఫర్‌గడ్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూనూరు జడ్పీ హైస్కూల్‌లో పాఠశాల పూర్వ విద్యార్థి ఇల్లందుల విజయ్‌కుమార్ ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా శనివారం ఎంఈవో పర్వేజ్, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టి, గ్రామంలోని హైస్కూల్‌లో చదివి ఉన్నతస్థాయికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ, హైస్కూల్ హెచ్‌ఎం ఎండీ.పర్వేజ్, ఉపాధ్యాయులు గిరిజాకుమార్, స్వరూపరాణి, విజయశ్రీ, కవిత, అనిల్‌కుమార్, అలీ, రాథోడ్, రాంబాబు, విజయ్‌కుమార్, సామాజిక సేవా ప్రతినిధి రాజిరెడ్డి పాల్గొన్నారు.

## సర్వేను పక్కాగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి, కుటుంబ, సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో విజయశ్రీ కోరారు. శనివారం ఘన్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో సర్వేలో సిబ్బంది అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలు చేశారు. ఈనెల 6 నుంచి 18 వరకు సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా సాగేలా గ్రామపంచాయతీ కార్యదర్శులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో శివునిపల్లి ఈవో తిరునగరి శ్రీకాంత్, సెక్రటరీలు సంతోష్, నరేష్, లింగ య్య, భవాని, అనురాధ, శారద, జేసుమణి, అవినాష్ పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వలు లేకుండా చూడాలి..

బచ్చన్నపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కాంటా ఐన వెంటనే మిల్లులకు పంపించాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు నిర్వాహకులకు సూచించారు. శనివారం కొడవటూరులో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు సెంటర్‌లో నాలుగు లారీల ధాన్యం తూకం వేసి ఉంచారని గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్రీనివాస్‌రా వు, వీఏవో గంగం వాణి పాల్గొన్నారు.

## ఐదు తరాల అపూర్వ కలయిక

తరిగొప్పుల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వారం ఒకే కుటుంబానికి చెందినవారు.. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయితేనేం దీపావళి వచ్చిందంటే వారంతా ఒకే చోటుకు చేరు కుంటారు. సామూహికంగా పండుగను జరుపుకుంటారు. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్‌కు చెందిన గుంటి మల్లయ్య బాలమ్మ దంపతులు(కురుమ) పూర్వీకులు ఏళ్ల క్రితం గ్రా మంలో స్థిర పడ్డారు. వారి కుల దైవం శ్రీ మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రతీఏడు దీపా వళి రోజున కేదారేశ్వర వ్రతం చేయడం ఆనవాయితీ. వారి సంప్రదాయం వారి ఐదుగురు కొడుకులు ఆచరించగా, వారి కుమారులు 30, తదనంతరం వారి తరం 70 కుటుంబాలకు చెందిన 250 కుటుంబ సభ్యులు ఈసారి వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం నోములు నోచుకోగా, శనివారం మల్లికార్జున ఆలయానికి చేరుకుని గౌరమ్మను ఒకరికొకరు అందించు కున్నారు. పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెల కొంది. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గుంటి కనకయ్య, భీమయ్య రాజు, సంపత్, బం టి, రవికుమార్, శ్రీను, మహేష్, సతీష్, స్వామి, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఒకే చోట దీపావళి వేడుకలు



ఒకే కుటుంబానికి చెందిన మహిళలు, నానమ్మ, అమ్మ, మనమరాళ్లు



జనగామ బస్టాండులో లక్కీడీప్ నిర్వహిస్తున్న డీఎం స్వాతి

## లక్కీ డీప్ ద్వారా విజేతల ఎంపిక

జనగామ కల్చరల్, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): డీలక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీడీప్ ద్వారా ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. శనివారం జనగామ బస్టాండులో జరిగిన లక్కీడీప్‌లో మొదటి విజేతగా లావణ్య (జనగామ), 2వ విజేతగా గౌతమి (మేడిపల్లి), 3వ విజేతగా కార్తీక (వరంగల్) ఎంపికైనట్లు డీఎం స్వాతి తెలిపారు. ఎంపికైన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఎం.సమ్మయ్య, సూపరింటెండెంట్ వై.యాదమణిరావు, కంట్రోలర్లు టీబీఎస్ రెడ్డి, ఎం.ఉప్పలయ్య, బి.బుచ్చయ్య పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి వార కల్యాణం

చిలుపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కల్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలలతోపాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభను జయప్రదం చేయండి

జఫర్‌గడ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే సీపీఎం మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు కోరారు. మహాసభ కరపత్రాలను శనివారం జఫర్‌గడ్‌లోని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

రాజు మాట్లాడుతూ ఈ మహాసభలో పార్టీ కార్యకలాపాలపై సమీక్షించడంతో పాటు ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాలపై కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, నాయకులు కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నక్క యాకయ్య, నల్లతీగల శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ




## చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

డి.పవన్‌కుమార్, ఎస్సై పాలకుర్తి

**ఆంధ్రజ్యోతి :** మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి ?

**ఎస్సై :** శాంతిభద్రతలు ప్రస్తుతం అదుపులో ఉన్నాయి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయి.

**ఆంధ్రజ్యోతి :** స్టేషన్‌కు వచ్చే బాధితుడకి న్యాయం చేస్తున్నారా ?

**ఎస్సై :** బాధితులు ఎవరైన సరే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమస్యను వివరిస్తే పరిష్కరిస్తున్నాం. వివిధ రాజకీయ పార్టీల నాయకుల పైరవీ కారులతో రావద్దని బాధితులకు సూచించారు.

**ఆంధ్రజ్యోతి :** గంజాయి, డ్రగ్స్ నివారణ చర్యలు ఏం తీసుకుంటున్నారు ?

**ఎస్సై :** గంజాయి డ్రగ్స్ నివారణ కోసం ప్ర త్యేక టీంను ఏర్పాటు చేశాం. అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నాం. ఇటీవల 22 కేజీల గంజాయిని పట్టుకున్నాం.

**ఆంధ్రజ్యోతి:** పేకాటపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

**ఎస్సై:** పేకాట ఆడుతున్న వారిపైనే కాకుండా వారికి సహకరించిన వారిపై కూడా ప్రత్యేక నిఘా పెట్టాం. ఇటీవల బమ్మెరలో పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ అధికారుల సాకారంతో దాడి 18 మందిని పట్టుకున్నాం.

-పాలకుర్తి

**మొదటి పేజీ తరువాయి**

## కుటుంబ సర్వేను సక్సెస్ చేయాలి

ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 2028లో రాహుల్‌గాం ధీని ప్రధానమంత్రిని చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం ఇష్టం లేదని, కేసీఆర్ కలెక్షన్ కమిషన్ ఎలక్షన్లపైన ఉద్యమం చేశారన్నారు. దొంగ దీక్ష చేసి తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టాడన్నారు. సోనియాగాంధీ దయతో రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మెన్లు బనుక శివరాజ్ యాదవ్, నల్లనాగుల శ్వేత, జూలకంటి లావణ్య, వైస్ చైర్మన్లు కొల్లూరి నర్సింహులు, జీవన్‌రెడ్డి, అయిలయ్య పాల్గొన్నారు.

## ఖాకీ వనంలో కలకలం

జూలై 29న సీపీ బదిలీ వేటు వేశారు. వీరు ఆయా స్టేషన్లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుండటంతో సీపీ చర్యలు దిగారు. అయితే ఒకవైపు సీపీ అవినీతిపరులపై ఉక్కుపాదం మోపుతున్నా వసూల్ రాజాలు మాత్రం తమ లీలలు ఆపడం లేదనే చర్చ జరుగుతోంది. మామునూరు ఏసీపీ పరిధిలోని ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పోలీస్ వేధింపులు శ్రుతిమించి పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా రోజులుగా అక్కడే తిష్టవేయటంతోపాటు వ్యవసాయ మార్కెట్ వ్యాపారులపై అధికంగా ఫిర్యాదులు వస్తుండటంతో ఆ పోలీసుకు కాసుల పంట పండుతోందనే ప్రచారం జరుగుతోంది. గత జూలై 27న పర్వతగిరి ఎస్సై వెంకన్న బెల్లం వ్యాపారి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం ఖాకీల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గత నెలలో మంత్రి అనుచరుడైన వరంగల్‌కు చెందిన ఓ నాయకుడి కుమారుడికి కారుకు ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు బైక్ తగిలించారు. దీనిపై పోలీసులు అత్యుత్సాహం చూపించి.. బైక్ నడిపిన ఇద్దరు యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. సదరు నాయకుడు కుమారుడితో పోలీస్ స్టేషన్ లోనే లాఠీతో కొట్టిస్తూ.. వీడియోకాల్‌లో చూపిస్తు ఆ నాయకుడిని సంతృప్తి పరిచారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి చెప్పుకో లేక సదరు యువకులు యాతన అనుభవించారని సమాచారం. ఈ ఘటనలో భారీగా ముట్టాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవి కొన్ని శాంపిళ్లు మాత్రమే.. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా రక్షించేవారే భక్షిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక సామాన్యులు ఆగంఅవుతున్నారనే చర్చ ప్రజల్లో జోరుగా జరుగుతుంది.

### సీపీ దృష్టికే వెళ్లనివ్వటం లేదట..

వరంగల్ సీపీగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అంబర్ కిషోర్‌ఝా తన మార్కు చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓఎస్డీగా, ఎస్పీగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేసిన అనుభవంతో సీపీగా ఆయన అర్ధరాత్రి వేళ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లోనూ సమస్యాత్మక ప్రాంతాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు ఫోకస్ చేస్తున్నారు. అయితే పోలీస్‌స్టేషన్‌లల్లో జరిగే సెటిల్‌మెంట్లు, అక్రమాలు, రాజకీయ ఒత్తిళ్లతో పెట్టే కేసుల తదితర వాటిని ఎప్పటికప్పుడు సీపీకి చేరవేయాల్సిన విభాగం విఫలమవుతోందనే చర్చ పోలీస్‌వర్గాల్లో జరుగుతోంది. ఆ విభాగంలో పని చేస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు పోలీసుల బదిలీల పైరవీలకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనరేట్ పరిధిలో సిన్సియర్‌గా పని చేస్తున్న కొంతమంది పోలీసులపై తప్పుడు సమాచారం ఇచ్చి బదిలీలకు కారణం అవుతున్నారనే అపవాదును కూడా ఎదుర్కొంటున్నారు. అక్కడక్కడ స్టేషన్లలో జరిగే తప్పులను ఈ విభాగంలో కొందరు ఖాకీలు క్యాష్ చేసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది.

ఈ విభాగంలోని ఓ బ్యాచ్‌కి సీపీ దగ్గర పని చేసే ఓ సహాయకుడు కూడా తోడైనట్టుగా పోలీస్ సర్కిల్‌లో వినిపిస్తోంది. ఈ విభాగంపై అత్యంత నమ్మకంతో సీపీ ఉన్నారని, దీంతో వారు ఆ నమ్మకాన్ని వారికి అనుకూలంగా మలుచుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఫలితంగా కింది స్థాయిలో జరిగే సంఘటనలు, అవినీతి, అక్రమాలు, సెటిల్‌మెంట్లు, పంచాయతీలు తదితర విషయాలు సీపీ దృష్టికి పూర్తిస్థాయిలో సకాలంలో వెళ్లటం లేదనే చర్చ జరుగుతోంది. ఈ విభాగం ఖాకీల తీరుపై నిఘా వర్గాలు కూడా ఆరా తీస్తుండటం పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, ట్రాఫిక్ విభాగం తరహాలోనే ఇతర అనుబంధ విభాగాలను కూడా కింది నుంచి పైవరకు ప్రక్షాళన చేస్తేనే వరంగల్ సిటీ పోలీస్‌లో కొత్త ఉత్సాహం వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.